క్లుప్తంగా

ఆంజనేయుడికి పంచామృతాభిషేకం


విగ్రహ ప్రతిమలకు ప్రత్యేక అలంకరణ

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆద్వర్యంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి శనివారం సంప్రోక్షణ, పంచామృతాభిషేకం నిర్వహించారు. అదే విధంగా తమలపాకులతో పూజ, వడమాల కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

లక్ష్మీనరసింహుడికి పూజలు


స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామికి శనివారం విశేషమైన పూజలు నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ గావించారు. పలు రకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పూల వ్యాపారి నిజాయితీ


బాధితురాలికి పర్సు అందజేస్తున్న రెడ్డెప్ప

కలికిరి : కలికిరి పంచాయతీ జడావాండ్లపల్లికి చెందిన జె.అమరావతి సొంత పనులు నిమిత్తం కలికిరికి వచ్చి తన పర్సు పోగొట్టుకుంది. 20 గ్రాముల బంగారు గొలుసు అందులో ఉండడంతో పోలీసులను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో స్థానిక పూల వ్యాపారి రెడ్డెప్పకు పర్సు దొరికింది. ఆయన నిజాయితీగా పోలీసులకు అందజేయడంతో.. బంగారు గొలుసు వున్న పర్సును బాధితురాలిని పిలిపించి అందచేశారు. నిజాయితీ చాటుకున్న రెడ్డెప్పను పోలీసులు అభినందించారు.

జనార్దన స్వామికి శయనోత్సవం


జనార్దనస్వామికి అలంకరణ

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ జనార్దన స్వామికి శనివారం శయనోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం తోమాల సేవ చేసి విశేష అలంకరణ చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

మల్లయ్యకొండకు దేశవాళీ ఎద్దు


ఎద్దును తీసుకువస్తున్న భక్తుడు

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంభిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు గోవులను వితరణగా ఇవ్వడం ఆనవాయితీ. గతంలో ఓ దాత ఇచ్చిన ఎద్దు భక్తులపై దాడి చేయడంతో రూ.25 వేలకు కూటమి నాయకుడు ఉత్తమరెడ్డి అమ్మి వేశారు. ఆ డబ్బుకు తన సొంత డబ్బు రూ.15వేలు జతచేసి దేశవాళీ ఎద్దు కొనుగోలు చేసి శనివారం ఊరేగింపుగా మల్లయ్యకొండను తీసుకెళ్లారు. పలువురు పూజలు చేసి పండ్లు పెట్టారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పెద్దతిప్పసముద్రం : వేసవికి ముందే తాగు నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జేఈ బాలచంద్రాచారి, మెకానిక్ చంద్రశేఖర్‌తో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇటీవల కాలంలో నీటి ఎద్దడి అధికంగా ఉన్న చోట 10 తాగునీటి బోర్లు డ్రిల్లింగ్ చేయించామన్నారు. అన్ని పంచాయతీల్లో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరమైన ట్యాంకులను ఏర్పాటు చేస్తామన్నారు.

ఎగబడుతున్న జనం.. నిలువునా నిర్లక్ష్యం

- బి.కొత్తకోటలో ప్లాస్టిక్ కవర్ల నీడలో నిర్వహణ
- మొలకలచెరువు, తుమ్మనగుట్టల్లో రోడ్లపైనే విక్రయం
- వసతుల కల్పనలో పంచాయతీల నిర్లక్ష్యం

తంబళ్లపల్లె నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సంతలకు వెళ్లి తమ ఉత్పత్తులను విక్రయిస్తుంటారు. ధరలు తక్కువగా, ఉత్పత్తులు నాణ్యతగా ఉంటాయని సామాన్యులు అధిక సంఖ్యలో ఇక్కడ కొనేందుకు ఇష్టపడతారు. ఏ సంతలో చూసినా జనం ఎగబడి కొనుగోలు చేస్తారు. అయితే వసతుల కల్పనలో పంచాయతీలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. కనీస వసతుల మాట దేవుడేరుగు.. తాగేందుకు గుక్కెడు నీరు అందుబాటులోలేని పరిస్థితి.

బి.కొత్తకోట : గ్రామీణ ప్రాంత ప్రజలకు వారపు సంతలే సూపర్ మార్కెట్లు. వారంలో ఏదో ఒక రోజు ఎక్కడో ఒక చోట సంత జరుగుతూ ఉంటుంది. వందల సంఖ్యలో గ్రామీణులు, వ్యాపారులు, రైతులు వచ్చి తమ ఉత్పత్తులను విక్రయిస్తారు.

బి.కొత్తకోట, గట్టు, కనికలతోపు, పెద్దతిప్పసముద్రం, కందుకూరు, అంగళ్లు, ముదివేడు, పెద్దమండ్యం, కలిచెర్ల, తురకపల్లె, కురబలకోట, తంబళ్లపల్లె, కొటాల, రేణిమాకులపల్లె, కోసువారిపల్లె, ములకలచెరువు, చౌడసముద్రం, బురకాయలకోటలో వారపు సంతలు గుర్తింపు పొందినవి. ఇందులో బి.కొత్తకోట (నగర పంచాయతీ), కందుకూరు, పెద్దతిప్పసముద్రం గ్రామాలకు కర్ణాటక నుంచి రైతులు, వ్యాపారులు తరలివస్తారు. అంగళ్లు, ములక లచెరువు, తంబళ్లపల్లె గ్రామాలకు దాదాపు 20 నుంచి 40 పల్లెలకు చెందిన ప్రజలు తరలివస్తారు. ఒక వారానికి సరిపడా కూరగాయలు, నిత్యావసరాలు, ఇతర సరకులు కొనుగోలు చేస్తారు.


ప్లాస్టిక్ కవర్ల నీడలో బి.కొత్తకోట వారపుసంత


ప్లాస్టిక్ కవర్లతో తంబళ్లపల్లె వారపు సంత

సంతల్లో అన్నీ సమస్యలే

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దమండ్యం, ములకలచెరువు, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో సంతలు దారుణంగా ఉన్నాయి. వాటి గుత్తలను అప్పగించేందుకు ఏటా మార్చి చివరిలో నిర్వహించే వేలంపాట ద్వారా రూ.లక్షల ఆదాయం లభిస్తోంది. అయినా వ్యాపారులు, రైతులు, సామాన్యుల కోసం కనీస వసతులు కల్పించలేదు. మండుటెండల్లో దాహం వేస్తే కొనుగోలు చేసి తాగాలి. బి.కొత్తకోట సంత నియోజకవర్గంలో పెద్దది. ఇక్కడి వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను ఆసరాగా చేసుకొని ఎండా, వానల నుంచి రక్షణ పొందుతారు. ములకలచెరువు, తుమ్మన గుట్ట, తంబళ్లపల్లెలో రోడ్లపైనే విక్రయిస్తారు. తుమ్మనగుట్టలో జాతీయ రహదారిపై విక్రయాలు సాగడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోలేదు. అయినప్పటికీ కనీస జాగ్రత్తలు కరవు. పీటీఎం రోడ్డులో ములకలచెరువు సంత రోడ్డుపైనే సాగుతుండడంతో వాహనాల రాకపోకలతో ప్రజలు ఇబ్బందిపడాల్సి వస్తోంది. వేసవిని దృష్టిలో పెట్టుకుని పంచాయతీలు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించడంతోపాటు తాగునీటిని అందుబాటులో ఉంచాలని, తరా ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఘనంగా సీటీఎం తిరునాల



అమ్మవారి దర్శనం కోసం వెళ్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో నలవీరగంగా భవానీ అమ్మవారు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎం నలవీర గంగా భవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం తిరునాల ఘనంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో సీటీఎం పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా అమ్మవారికి భక్తజనం కర్పూర నీరాజనాలతో టెంకాయలు కొట్టి స్వాగతం పలికారు. కొందరు మహిళలు గాజులు, పసుపు, కంకుమ, చీరలను సమర్పించారు. ఆలయ ధ్వజ స్తంభం ఎదుట టెంకాయలు కొట్టి నిమ్మకాయలతో దీపాలు వెలిగించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాలూకా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీటు డిపో జాతరకు ప్రత్యేక బస్సులు నడిపారు.

జాతర ప్రాంగణంలో కోలాహలం

జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద కోలాహలం నెలకొంది. దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కొలంబస్, జెయింట్‌వీల్‌తోపాటు పలు ఆటలతో సందడిగా మారింది. ఆదివారం దోపు తిరునాలతో జాతర ముగుస్తుందని జాతర కమిటీ నిర్వాహకులు సీటీఎం సర్పంచు ఆనందపార్థసారథి, వీరప్రతాప్, వెలుగు చంద్ర, సురేంద్రరెడ్డి తెలిపారు. అలాగే ఎద్దుల పరుష ప్రారంభమవుతుందని తెలిపారు.

బోర్డుసరే... ఊరిపేరేది?



బోర్డు ఏర్పాటు చేశారు సరే.. అందులో ఊరి పేరు కనిపించడం లేదంటూ ప్రయాణికులు ఎద్దేవా చేస్తున్నారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీలో బత్తినగారిపల్లె ఉంది. ఎన్‌హెచ్–340 రహదారిపై కేశాపురం నుంచి కలిచెర్లకు వెళ్లే మార్గంలో ఈ గ్రామం ఉంటుంది. గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రయాణికులు ఈ గ్రామానికి వెళ్లే మార్గాన్ని సూచిస్తూ రోడ్డు పక్కనే బోర్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ బోర్డు చెదలు పట్టి తీగెలు అల్లుకుపోయాయి. అసలు అక్కడ బోర్డు ఉన్నట్లు గుర్తించలేని పరిస్థితి. అధికారులు స్పందించి బోర్డు సరిచేయాలని వారు కోరుతున్నారు. – గుర్రంకొండ:

మరుగుదొడ్ల పనుల పరిశీలన

బి.కొత్తకోట : స్థానిక జ్యోతి చౌక్‌లో నగర పంచాయతీ అధికారులు చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణాలను రహదారి భవనాల శాఖ ఈఈ అరవిందాదేవి శనివారం పరిశీలించారు. రహదారిపై నిర్మిస్తున్నారనే ఫిర్యాదుపై ఆమె పనులను తనిఖీ చేశారు. రక్షిత నీటి ట్యాంకు పక్కన నిర్మిస్తున్న నిర్మాణం రహదారికి ఇబ్బంది కలగకుండా చేపట్టాలని ఈఈ కమిషనర్ పల్లవిని కోరగా భవిష్యత్‌లో ఇబ్బందులొస్తే సహకరిస్తామని స్పష్టం చేశారు. బస్ షెల్టర్ ఉన్న చోట నిర్మాణం చేపట్టకుంటే మళ్లీ ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కమిషనర్ చెప్పారు. దీంతో నిర్మాణాలతో ఎలాంటి ఇబ్బంది లేదని అరవిందాదేవి చెప్పారు. కాగా 30 వేలకు పైబడిన జనాభా, రోజూ వందల సంఖ్యలో ప్రజల రాకపోకలతో ఉండే బి.కొత్తకోటలో దశాబ్దాలుగా మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నగర పంచాయతీ కమిషనర్ పల్లవి వాటి నిర్మాణం కోసం కృషి చేస్తుంటే అడ్డుకునేందుకు ఫిర్యాదులు చేస్తున్న వారిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులకు అండగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శిస్తున్నారు.

యాసిడ్ దాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మదనపల్లె : ప్యారంపల్లెలో యువతిపై యాసిడ్ దాడి ఘటనలో నిందితుడు గణేష్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, మురళీ డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో కృష్ణప్ప, మురళి మాట్లాడుతూ మదనపల్లి పట్టణంలో మహిళలు, యువతులు, ఆఖరుకు చిన్న పిల్లలు, ముసలి వారిపై వరుసగా దాడులు జరుగుతున్నాయన్నారు. కొంతకాలం కిందట ఓ సీఐ తల్లిని దారుణంగా హత్యచేసి పూడ్చిపెట్టడం జరిగిందన్నారు. యువత ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడానికి మాదక ద్రవ్యాలు కారణమని, విచ్చలవిడిగా సమాజంలో చలామణి అవుతున్నాయన్నారు. చట్టాలను నిష్పక్షపాతంగా అమలు చేయాల్సిన పాలకవర్గాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం చట్టాలను నీరు కారుస్తున్నాయన్నారు. ఇలాంటి ఉన్మాదాలను అరికట్టాలంటే ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు రెడ్డి,సూరి, నేషనల్ ఫ్లాగ్ ఫైటర్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

వివాహ వేడుకలో మాజీ మంత్రి

పీలేరు రూరల్ : స్థానిక స్థానిక ఎంఎం ఫంక్షన్ హాల్ నందు జరిగిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి కుమార్తె వివాహ వేడుకకు మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరు మాజీ చింతల రామచంద్రారెడ్డి శనివారం రాత్రి ముఖ్య అతిథులుగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు సురేంద్రనాథరెడ్డి, చిచ్చిలి బాబురెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చక్రధర్, ఆనంద్, ఉదయ్, కాలనీ చిన్న, ద్వారకనాథరెడ్డి, అబీద్, నాగభూషణం, విక్టరీ వెంకటరమణారెడ్డి, నిరంజన్‌రెడ్డి, దావూద్ తదితరులు పాల్గొన్నారు.


వధూవరులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అంగళ్లులో పూర్వ విద్యార్థులు

కురబలకోట : అంగళ్లు సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అల్యూమిని-25 మీట్ పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఐబీఎం కన్సల్టెంట్ ఎ.శీతల్, బెంగళూరు సీఎంఆర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ మెరుగైన అవకాశాలు పొందాలంటే టెక్నికల్, కమ్యూనికేషన్ స్కిల్స్ తోపాటు టెక్నాలజీని అనుసరించాలన్నారు. ఏ స్థాయిలో పూర్వ విద్యార్థులు ఉన్నా.. కళాశాలకు వచ్చి వర్క్‌షాప్స్, గెస్ట్ లెక్చర్స్, ప్లేస్‌మెంట్‌లో తోడ్పడాలన్నారు. కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులే తమ బలమని, తమ విద్యార్థులకు కళాశాల రెండో ఇల్లు లాంటిదన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.రమణారెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల విజయగాథలు ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. అలుమినీ మీట్ కల్పించే అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. డాక్టర్. బి. శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకలో మాజీ ఎమ్మెల్యే

కలికిరి(వాల్మీకిపురం) : పట్టణంలోని జరిగిన సుధాకర్ రెడ్డి కుమార్తె ప్రత్యూష నిశ్చితార్థ వేడుకలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఇదే గ్రామానికి చెందిన పుట్టా శంకర్‌రెడ్డి కుమారుడు పుట్టా కులదీప్‌రెడ్డి వివాహం సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ల భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, నాయకులు చింతల ఆనందరెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో వధూవరులను ఆశీర్వదిస్తున్న చింతల రామచంద్రారెడ్డి

మృతికి సంతాపం

పట్టణంలోని కొత్తపేట వీధికి చెందిన నల్లవీర గంగా భవాని ఆలయ ట్రస్టు చైర్మెన్ వర్ధన రమణారెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి మరణించారు. మాజీ ఎమ్మెల్యే చింతల శనివారం ఉదయం వారి ఇంటికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

తంబళ్లపల్లె : రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించినప్పుడే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ అనసూయమ్మ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా శాఖల వారీ అధికారులు ప్రగతి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరించారు. సమావేశంలో పలువురు గ్రామాల్లో సమస్యలు, మౌలిక వసతుల కల్పన, సీసీ రోడ్ల సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు రికార్డుల్లో పొందుపరిచి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కరీం, కోఆప్షన్ సభ్యులు జమాల్ బాషా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి


రుణాలు అందజేస్తున్న మేనేజర్ పరుశురాంనాయక్

పీలేరురూరల్ : స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, యూనియన్ బ్యాంక్ రీజనల్ చీఫ్ మేనేజర్ పరుశురాంనాయక్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు శనివారం రూ.2 కోట్ల మేర రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణంతో అభివృద్ధి చెంది.. తిరిగి చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జవహర్‌బాషా, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమణ, ఫీల్డ్ అఫీసర్ తేజారెడ్డి, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందిస్తాం

– ఆర్టీసీ డీఎం వెంకటరమణారెడ్డి


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు


తంబళ్లపల్లె : మహా శివరాత్రి పర్వదినాన మల్లయ్య కొండపై జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని మదనపల్లె-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణా రెడ్డి అన్నారు. ఆయనతోపాటు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల డిప్యూటీ సీఎంఈ జగదీష్, సీఐ రేవతిలు ఆర్టీసీ బస్సులో శనివారం మల్లయ్యకొండను సందర్శించారు. పూజారి ఈశ్వరప్ప వారికి స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం కొండపై బస్సులు నిలిపేందుకు రోడ్డును పరిశీలించారు. గత ఏడాది కంటే ఈసారి ఎక్కువ బస్సు సర్వీసులు నడిపేందుకు కృషి చేస్తామన్నారు. ఉత్తమరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



మందులు అందజేస్తున్న పసుపులేటి చలపతి


మదనపల్లె : మండలంలోని కురవంక పంచాయతీలో వైఎస్సార్ సీపీ సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మదనపల్లెకు చెందిన సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ ఆస్పత్రి సహకారంతో స్థానిక సీతారామ కల్యాణమండపంలో నిర్వహించిన ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఎముకల వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేశారు. పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొని చికిత్స తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీవైఎస్ అధ్యక్షులు పునీత్‌కుమార్, శ్రీనివాసులు, లక్ష్మీ, కృష్ణమూర్తి, నాగరాజు, శివారెడ్డి, చిన్నరాయుడు, నరసింహులు, నాగరాజ, సద్దలహరి, చిరంజీవి, హరీష, నందిని, సతీష్‌కుమార్, స్వాస్థ ఆస్పత్రి సిబ్బంది పవన్, హేమంత్, ప్రశాంత్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి


పీలేరు క్రాస్ రోడ్డులో మానవహారం


మదనపల్లె : అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు


రెడ్డెమ్మకొండ పరిసరాల్లో పిచ్చిమొక్కల తొలగింపు


తంబళ్లపల్లె : అవగాహన కల్పిస్తున్న ఎంఓ తేజస్వి


రామసముద్రంలో ర్యాలీ చేస్తున్న అధికారులు

పీలేరు: స్వచ్ఛాంధ్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరు పట్టణంలో శనివారం స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలన్నారు. హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి, బరోడా బ్యాంక్ మేనేజర్ మదన్‌మోహన్, పురం రామమూర్తి, అరవింద్, రేవూరి సుధీర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

మదనపల్లె సిటీ : స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఒంటిమిట్టపల్లెలో తడి, పొడిచెత్తపై శనివారం అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని , రోగాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయరాదని, చెత్తకుండీలలో వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ సతీష్‌బాబు, అరుణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో 24వ వార్డులో ఇంటింటా తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు మోహన్‌వల్లి, జ్యోతి, వనజ, మోహన్‌బాబు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుర్రంకొండ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మకొండ ఆలయ పరిసరాల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఆలయంలో అమ్మవారి పుష్కరిణితోపాటు ఆలయ పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

తంబళ్లపల్లె : ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి అన్నారు. సీహెచ్‌సీలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ పొడిచెత్త, తడిచెత్త సేకరించి పంచాయతీ కార్మికులకు అప్పగించాలన్నారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విక్రాంత్‌రెడ్డి, హెడ్ నర్సు గ్లోరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

రామసముద్రం: మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ బానుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం అధికారులు, తదితరులు పాఠశాల నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ సర్కిల్‌తో మానవహారం చేపట్టారు.